క్లుప్తంగా

జగనన్నను గెలిపించుకుందాం

నందవరం: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలన్నీ యథావిధిగా ఇంటింటికీ అందుతాయని వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా ప్రతుల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఇబ్రహీంపురం, కొట్టాల గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నవరత్నాలతో పేదల ఇంట సంక్షేమ వెలుగులు నింపిన ప్రభుత్వానికి అండగా నిలవాలని ఓటర్లను కోరారు. సర్పంచ్ నాగేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇంటింటి ప్రచారం

ఆలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షిని గెలిపించాలని కోరుతూ హాలహర్వి మండలం విరుపాపురం, బొళగోట, కురులేహళ్లి గ్రామాల్లో బుధవారం ఆయన కుమారుడు చంద్రశేఖర్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు అందించారు. గత టీడీపీ పాలనలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు పడిన కష్టాలు, ప్రస్తుతం జగనన్న పాలనలో అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నట్లు గుర్తు చేస్తూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. సర్పంచ్ మల్లికార్జున, నాయకులు ఎల్లప్ప, వీరేషప్ప, ఉలెప్ప, తదితరులు పాల్గొన్నారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ఆలూరు రూరల్: ఈ నెల 21వ తేదీన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాఘవరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చదివేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఐదో తరగతి సిలబస్‌లో ఇంగ్లిష్, తెలుగులో ఉంటుందని, ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్లను http://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమాభివృద్ధి

హొళగుంద: ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగించడంతో పాటు మరింత అభివృద్ధి జరగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు బుసినే శ్రీరాములు, మండల కన్వీనర్ షఫివుల్లా అన్నారు. వారు బుధవారం వందవాగిలి, లింగంపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి జగనన్న చేసిన మేలును వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు ఈశా, మల్లికార్జున, హనుమంతు రెడ్డి, శేషన్న, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు బూటకపు హామీలను నమ్మొద్దు



ఎమ్మిగనూరు 12వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో బూటకపు హామీలిస్తున్న ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబును, ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకోవాలని వచ్చే టీడీపీ నాయకులను నమ్మవద్దని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక సూచించారు. ఆమె బుధవారం పట్టణంలోని 12వ వార్డులో వీరశైవ లింగాయత్, కుర్ణి కరికల కార్పొరేషన్ చైర్మన్లు రుద్రగౌడ్, బుట్టా శారదమ్మ, వార్డు ఇన్‌చార్జ్ షాబుద్దీన్, శాప్ నెట్‌వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. మహిళలు, వృద్ధులను పలకరిస్తూ వారి యోగక్షేమాలు, సమస్యలు తెలుసుకొంటూ సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగనన్నను మరోసారి గెలిపించాలని, అందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ.. జగనన్న ఐదేళ్ల పాలన ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సాగిందని వివరించారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా ఆ పార్టీ నేతలకు దోచిపెట్టేలా చంద్రబాబు దుర్మార్గపు పాలన సాగించారని, అందుకే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని వివరించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా బీవై రామయ్యను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. నాయకులు బుట్టా శివ నీలకంఠ, రియాజ్‌అహమ్మద్, సునీల్‌కుమార్, వాహిద్, ఇషాక్, అమాన్, సుధాకర్, అబ్రార్, ప్రతాప్ రెడ్డి, గట్టుఖాజ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల/ఎమ్మిగనూరురూరల్: గోనెగండ్ల మండలంలోని చిన్న నేలటూర్ గ్రామంలో, ఎమ్మిగనూరు మండలంలో బనవాసి ఫారంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, భర్త శివ నీలకంఠ పాల్గొన్నారు. సీతారాముల కల్యాణ వేడుకను తిలకించి ప్రత్యేక పూజలు చేశారు.

సీఎం జగనన్నతోనే కర్నూలుకు 'న్యాయం'



ఎన్నికల చట్టాలు, నియమావళి బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న బుట్టా రేణుక, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే కర్నూలులో హైకోర్టు ఏర్పాటు అవుతుందని తద్వారా జిల్లాకు న్యాయం చేకూరనుందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సువర్ణారెడ్డి, రీజనల్ కో–ఆర్డినేటర్ ఎం.ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎన్నికల చట్టాలు, ప్రవర్తనా నియమావళి బుక్‌లెట్‌ను ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. కర్నూలుకు న్యాయం చేసేందుకు జిల్లా కేంద్రంలో 150 ఎకరాల్లో రూ.వెయ్యి కోట్లతో నిర్మించనున్న నేషనల్ లా యూనివర్సిటీకి సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. వంద కోట్లతో న్యాయవాదుల సంక్షేమ నిధి ఏర్పాటు చేసి లా నేస్తం కింద జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేలు మంజూరు చేస్తున్నారన్నారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటును ప్రతిపక్షనేత చంద్రబాబు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలతో పాటు న్యాయవాదులకు మేలు చేకూర్చిన సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. లీగల్ సెల్ నాయకులు గురురాజారావు, సుధాకర్,షాషావలి, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆర్‌ఓ చిరంజీవి

ఎమ్మిగనూరురూరల్/ ఆలూరు: సార్వత్రిక ఎన్నికల సమరంలో భాగంగా గురువారం నుంచి 25వ తేదీ వరకు అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తామని ఎమ్మిగనూరు ఆర్‌ఓ చిరంజీవి, ఆలూరు ఆర్‌ఓ డి.రామునాయక్ పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ.. 10 గంటల నుంచి సాయింత్రం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థితో పాటు 5 మందికి మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తామని చెప్పారు. అభ్యర్థులు ఎన్నికల కమీషన్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. తహసీల్దార్లు శేషారెడ్డి, భూపతిపార్వతి, చంద్రశేఖరయ్య తదితరులు ఉన్నారు.

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

ఎమ్మిగనూరురూరల్: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా ఉంచుతామన్నారు. డీఎస్పీ సీతారామయ్య, టౌన్, రూరల్ సీఐలు మధుసూదన్‌రావు, మోహన్‌రెడ్డి, ఎస్ఐలు రమేష్‌బాబు, శరత్‌కుమార్‌రెడ్డి వెంట ఉన్నారు.

పత్తికొండ రూరల్: నియోజకవర్గ నామినేషన్ కేంద్రం పత్తికొండ ఆర్డీఓ కార్యాలయాన్ని ఎస్పీ కృష్ణకాంత్ పరిశీలించారు. డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల స్ట్రాంగ్ రూం పరిశీలన అనంతరం రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి చేరుకుని ఆర్డీఓ నీలపు రామలక్ష్మితో మాట్లాడారు. నామినేషన్ల ప్రక్రియలో సమస్యలు తలెత్తకుండా తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. సీఐ మురళీమోహన్, సిబ్బంది ఉన్నారు.

ఆలూరు: ఆదోని, ఆలూరు నియోజకవర్గాల పరిధిలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ఈవీఎంలను ఉంచిన గదులు, భద్రత, సీసీ కెమెరాలు, పోలీసు సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆర్‌ఓ డి.రామునాయక్, తహసీల్దార్ చంద్ర శేఖరయ్య, సీఐ బి.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



ఆలూరు స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారంలో పోలింగ్ బూత్‌లను జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ పరిశీలించారు. పకడ్బందీగా పోలింగ్ నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ రమేష్‌బాబు వెంట ఉన్నారు.

కుట్రల కూటమిని జనం నమ్మరు



దేవనకొండలో ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి ప్రచారానికి బ్రహ్మరథం పట్టిన ప్రజలు

దేవనకొండ: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, కూటమి నాయకులు చెప్పే బూటకపు హామీలను ప్రజలు నమ్మరని, ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నీ నెరవేర్చిన వైఎస్ జగనన్నను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటారని వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి అన్నారు. ఆయన బుధవారం దేవనకొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, పార్టీ ఆలూరు ఎన్నికల అబ్జర్వర్ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తే అభివృద్ధికి వేసినట్లేనని, టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్‌కు ఓటు వేస్తే మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం అక్రమ వ్యాపారాలకు మద్దతు తెలిపినట్లు అవుతుందని వివరించారు. మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని అక్రమ మద్యం, పేకాట స్థావరాలు అడ్డంగా నడిపారని, ఏ రోజూ ఆలూరు అభివృద్ధికి పాటుపడలేదని విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న వీరభద్ర గౌడ్ ఆ పార్టీ అధికారంలో ఉన్నా ఏనాడూ ఆలూరు అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. మే 13న ధర్మం, ప్రజల శ్రేయస్సు మార్గంగా ఎంచుకున్న వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తారో, అధర్మం, హింస, అక్రమాలను నమ్ముకున్న మేక వన్నె పులి టీడీపీ కూటమికి ఓటు వేస్తారో ప్రజలే నిర్ణయించుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తపాల శ్రీను, కబీర్‌దాసు, శశికళ, రామకృష్ణ, రాజారెడ్డి, నిజాల్‌రెడ్డి, లుముంబా తదితరులు పాల్గొన్నారు.

భారీగా చేరికలు

అభ్యర్థి విరుపాక్షి ప్రచారంలో టీడీపీకి చెందిన నాయకులు దాదాపు వంద కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఐరన్‌బండ బి.సెంటర్‌కు చెందిన దస్తగిరి, రవి, లక్ష్మన్న, వారి అనుచరులు, కూకటికొండకు చెందిన ఉప్పరి తిమ్మన్న, సీతారాముడు, సోములు రాజశేఖర్, లక్ష్మినారాయణ, వారి అనుచరులు 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పి.కోటకొండకు చెందిన కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ముఖ్య అనుచరుడు ఆలంకొండ చిన్నకొలుట్ల, ఆయన వర్గం, దేవనకొండ బీజేపీ నాయకుడు వీరయ్య, కాంగ్రెస్ నుంచి కటికె కృష్ణ వైఎస్సార్‌సీపీలో చేరారు.

దేవనకొండలో బైకు ర్యాలీ

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షికి మద్దతుగా యువత ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. మీ వెంటే మేమంటూ దాదాపు 300 మంది ర్యాలీలో పాల్గొనగా ఆ రస్తా వైఎస్సార్‌సీపీ జెండాలతో నిండిపోయింది.

టికెట్ ఇవ్వనందుకు పార్టీ మారి నిందలా?



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న బుట్టా రంగయ్య, నక్కలమిట్ట శ్రీనివాసులు

ఎమ్మిగనూరుటౌన్: ఎంపీ/ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడంతో గుర్తింపునిచ్చిన పార్టీని వదిలి టీడీపీలో చేరి ఇప్పుడు నిందలు వేస్తున్నావా సంజీవా అని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టా రంగయ్య, బీసీ సంఘం జాతీయ నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. కర్నూలు ఎంపీ సంజీవకుమార్‌కు పార్టీ టికెట్ ఇవ్వలేదన్న అక్కసుతో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి, ఎంపీ పదవికి మాత్రం స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేయకుండా డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీగా ఐదేళ్లు కొనసాగిన సంజీవ్‌కుమార్ పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి పనులకు ఎంతమేర సహకరించారో ఆయనకే తెలియాలన్నారు. పట్టణంలో కుర్ణి, కురువ, బోయ కల్యాణ మండపాల కోసం రూ.కోటి ఎంపీ నిధుల కోసం ప్రతిపాదనలు పంపితే 8 శాతం పర్సెంటేజీ దండుకున్న నీచ సంస్కృతి ఆయనదని ధ్వజమెత్తారు. అలాంటి వ్యక్తి ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన ఆయన సలహాలను అభ్యర్థి బుట్టా రేణుక తీసుకోవడాన్ని వక్రీకరించడం తగదన్నారు. రాష్ట్ర శాప్ నెట్‌వర్క్ చైర్మన్ మాచాని వెంకటేష్, పద్మశాలి సంఘ అధ్యక్షుడు విశ్వనాథ్ రమేష్, కౌన్సిలర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.